క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అమరావతి: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల దృష్ట్యా మంగళవారం సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ అశోక్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి 9 గంటల పాటు కరెంట్ ఉండదని చెప్పారు. అమరావతి మండలంలోని అన్ని గ్రామాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు జగనన్న సురక్ష కార్యక్రమం

అచ్చంపేట: మండలంలోని చల్లగరిగ, గ్రంథశిరి గ్రామాలలో జగనన్న సురక్ష మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.శివసుబ్రహ్మణ్యం సోమవారం తెలిపారు. గ్రంథశిరిలో నిర్వహించనున్న కార్యక్రమంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు హాజరవుతారని చెప్పారు.

క్రోసూరు: మండలంలోని రెండు పంచాయతీల్లో మంగళవారం జగనన్న సురక్ష శిబిరాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బి.మహేష్ సోమవారం తెలిపారు. క్రోసూరు–1 సచివాలయం, బయ్యవరం సచివాలయంలో గ్రామసభలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

సమాజాన్ని సన్మార్గంలో నడిపించేది గురువే

అమరావతి: ప్రపంచాన్ని సన్మార్గంలో నడిపించి అందరికి మార్గదర్శకంగా నిలిచేది గురువేనని భవఘ్ని గురూజీ అన్నారు. మండల పరిధిలోని వైకుంఠపురం సోమవారం భవఘ్ని ఆరామంలో గురు పూర్ణిమ సందర్భంగా వ్యాసపూజ, భవఘ్ని మహాశాంతి యజ్ఞం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో ఏ దేశానికి లేనంత ఆధ్యాత్మిక జ్ఞాన సంపద మనదేశానికి ఋషులు, మునులు, గురువులు అందించారన్నారు. అదిగురువు వ్యాస భగవానునికి ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం వ్యాసభగవానుని విగ్రహానికి ఊరేగింపు నిర్వహించారు ఈవేడుకలలో పాల్గొన్న భక్తులందరికి నిర్వాహకులు అన్నదానం చేశారు.

రైలు పట్టాలపై యువకుడి మృతదేహం

నకరికల్లు: నకరికల్లు శివారులో కొండప్రాంతంలో రైలు పట్టాలపై యువకుడి మృతదేహాన్ని సోమవారం స్థానికులు గుర్తించారు. వివరాలు.. నకరికల్లుకు చెందిన యర్రంశెట్టి మల్లికార్జున(24) ఆదివారం సాయంత్రం ఇంట్లోనే ఫోన్ చార్జింగ్ పెట్టి బజారుకు వెళ్తున్నానని చెప్పి వెళ్లాడు. రాత్రంతా ఇంటికి రాలేదు. సోమవారం నకరికల్లుకు శివారు కొండల మధ్య ఉన్న రైలుపట్టాలపై మృతదేహం ఉందన్న సమాచారం పోలీసులు చేరుకుని మృతుడు మల్లికార్జునగా గుర్తించారు. మృతుని అన్న యర్రంశెట్టి వెంకయ్య ఫిర్యాదు మేరకు నరసరావుపేట రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల ప్రారంభం

బెల్లంకొండ: మండలంలోని రామాంజనేయపురంలో రూ.35 లక్షలతో నిర్మించిన ప్రభుత్వ పాఠశాల, రూ.15 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాలను జిల్లా అటవీ అధికారి రామచంద్రరావుతో కలసి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం గ్రామంలో అన్నీ వసతులు కల్పిస్తామని తెలిపారు. అటవీ ప్రాంతం కావడంతో అభివృద్ధి కార్యక్రమాలకు అనుమతులు తీసుకురావడం కష్టమైందని, డీఎఫ్ఓ రామచంద్రరావు సహకారంతో అనుమతులు త్వరితగతిన వచ్చాయన్నారు. సత్వరమే గ్రామంలోని నివాసం ఉంటున్న వారికి ఇళ్ల పట్టాల మంజూరు, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, సైడ్ కాల్వలతో అంతర్గత రహదారులు, అదనంగా మంచి నీటి బోర్ల ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ చెన్నుపురెడ్డి పద్మావెంకటేశ్వరరెడ్డి, ఎంఈఓ మల్లికార్జున శర్మ, గ్రామ సర్పంచి దారం వెంకట నరసమ్మ, సొసైటీ అధ్యక్షుడు భద్రయ్య, నాయకులు బొడ్డుపల్లి రాము, చిట్టిబాబు, రమణారెడ్డి, రామిరెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

పెదకూరపాడు: రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని అబ్బురాజుపాలెంలో సోమవారం చోటుచేసుకుంది. బంధువులు, స్థానికుల కథనం మేరకు పెదకాకాని మండలం తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన గుంటక ఉషారాణి(25) భర్త శివారెడ్డి పెదకూరపాడు మండలంలోని జలాలపురం గ్రామంలోని బంధువుల ఇంట్లో జరిగే దశదిన కర్మకు హాజరయ్యారు. మృతురాలి తల్లిదండ్రుల గ్రామం 75 త్యాళ్లూరు గ్రామానికి వెళుతున్న సమయంలో అబ్బురాజుపాలెం చెరువు వద్ద ప్రమాద వశాత్తు గుంతలో పడి ఉషారాణికి గాయపడింది. సత్తెనపల్లి ఏరియా ఆసుపత్రికి తరలిస్తున్న సమయంలో మార్గమధ్యంలో ఉషారాణి మృతి చెందింది. మృతురాలికి రెండు సంవత్సరాల బాబు ఉన్నాడు.

అర్హులకు ధ్రువీకరణ పత్రాలు మంజూరు

పలుదేవర్లపాడు(ముప్పాళ్ల): ప్రభుత్వ సంక్షేమ పథకం పొందేందుకు అర్హులై ఉండి ధృవీకరణ పత్రం లేకుండా ఉంటే వారికి జగనన్న సురక్ష ద్వారా అప్పటికప్పుడే అందించటం జరుగుతుందని ఎంపీడీఓ పీ పుట్టారెడ్డి చెప్పారు. మండలంలోని పలుదేవర్లపాడు గ్రామంలో మంగళవారం జరగనున్న జగనన్న సురక్షలో భాగంగా దరఖాస్తులు చేసుకున్న వారి వద్దకు సోమవారం వెళ్ళి వారి సమస్యలను తెలుసుకున్నారు.

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలు

● ఆలయాలకు పోటెత్తిన భక్తజన సందోహం ● ప్రత్యేక పూజలకు హాజరైన మంత్రి అంబటి రాంబాబు



సత్తెనపల్లిలో పూజలకు హాజరైన భక్తులు



సత్తెనపల్లిలో ప్రత్యేక అలంకరణలో సాయిబాబా



పట్టణంలోని షిరిడి సాయిబాబా మందిరంలో పూజల్లో మంత్రి అంబటి రాంబాబు



చల్లగుండ్లలో విశేషఅలంకరణలో సాయిబాబా స్వామివారు



సామూహిక శ్రీసాయి సత్యవ్రతం నిర్వహిస్తున్న మహిళ భక్తులు

సత్తెనపల్లి: గురు పౌర్ణమి పురస్కరించుకొని పట్టణం, మండలంలోని వివిధ ఆలయాలలో సోమవారం భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. పట్టణంలోని శరభయ్య గుప్తా హిందూ ఉన్నత పాఠశాల ప్రాంగణంలోని షిరిడి సాయిబాబా మందిరం, నాగార్జున నగర్, రఘురాం నగర్‌లోని రామాలయం, వడ్డవల్లిలోని శ్రీ రామాలయం వెంకటేశ్వర స్వామి దేవాలయం, రైల్వే గేట్ సమీపంలోని ఆలయాల్లో సోమవారం గురుపౌర్ణమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. అలాగే మండలంలోని నందిగామ, కొమెరపూడి, కంటేపూడి, గుడిపూడి, పెద్దమక్కెన తదితర గ్రామాలలో వేడుకలు నిర్వహించారు. పట్టణంలోని శరభయ్య గుప్తా హిందూ ఉన్నత పాఠశాల ప్రాంగణంలోని షిరిడి సాయిబాబా మందిరంలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ప్రత్యేక పూజలకు హాజరు కాగా సాయిబాబా సేవా సమాజం అధ్యక్షుడు చల్లా రత్తయ్య ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పూజల అనంతరం మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ మన సమాజంలో గురువుకు విశిష్టమైన స్థానం ఉందని, అజ్ఞాన చీకట్లను జ్ఞాన కాంతులతో పారదోలే దివ్య చైతన్య స్ఫూర్తిగా గురువును పిలుస్తారన్నారు. ఆయనతోపాటు వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాలు రాజనారాయణ తదితరులు సాయిబాబాకు పూజలు నిర్వహించారు. భక్తులకు పెద్ద ఎత్తున అన్నసంతర్పణ చేశారు. పట్టణంలోని త్రిశక్తి దుర్గాపీఠంలో అమ్మవారిని శాకంబరీగా అంకరించి పూజలు నిర్వహించారు.

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

నకరికల్లు: మండలంలోని చల్లగుండ్లలోని భగవాన్ వెంకయ్య స్వామి, దత్తాత్రేయస్వామి, సాయిబాబా మందిరాలలో సోమవారం గురుపౌర్ణమి సందర్భంగా విశేష పూజలు చేశారు. అర్చకులు అరిపిరాల వెంకటనారాయణ ఫణీశ్వర్ ఆధ్వర్యంలో స్వామివార్లకు విశేష ద్రవ్యంలతో అభిషేకాలు చేశారు. స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించారు. గురుపౌర్ణమి విశిష్టమైన రోజు కావడంతో ముగ్గురు స్వామివార్లను దర్శించుకునేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

రాజుపాలెం మండలంలో..

రాజుపాలెం: మండలంలోని ఆకుల గణపవరంలోని సాయిబాబా మందిరంలో పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు స్వామివారి దర్శనం కోసం బారులు తీరారు. ఆలయ పూజారి పర్వతాలశర్మ పూజాకార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

క్రోసూరు: స్థానిక సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మందిరం భక్తులతో కిటకిట లాడింది. ఆలయ కమిటీ అధ్యక్షుడు మన్నెం వెంకట్రావు, కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం బాబాను పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు.

ముప్పాళ్ల: మండలంలోని చాగంటివారిపాలెంలోని ప్రసన్న షిరిడి సాయిబాబా మందిరంలో సాయిబాబాకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం బాబా వారిని గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. మాదలలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

పెదకూరపాడులో..

పెదకూరపాడు: స్థానిక సాయిబాబా మందిరం, మండలంలోని అయోధ్యస్వామి ఆశ్రమం, అబ్బురాజుపాలెం, బుచ్చిపాలెం బాబా మందిరాల్లో సోమవారం గురపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆశ్రమంలో గురుబంధు శివప్రసాద్ భక్తులతో సామూహిక సాయి సత్యవ్రతం జరిపించారు. గురుపౌర్ణమి విశిష్టను స్వతంత్ర భారతి వివరించారు. ఆశ్రమ నిర్వాహకులు కె.రామకృష్ణ, కోటేశ్వరమ్మ పర్యవేక్షణలో వేడుకలకు వచ్చిన భక్తులకు అన్న సంతర్పణ చేశారు.

జగనన్న సురక్షతో ప్రజలకు మేలు

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అమరావతి: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల విషయంలో లబ్ధిదారుల సమస్యలన్నీ తీర్చాలని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. మండలం పరిధిలోని నరుకుళ్లపాడు సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీడీఓ మాధురి అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. పేదలకు మంచి జరుగుతుంటే చూడలేని చంద్రబాబు లాంటి వాళ్లు కావాలని దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. జగనన్న సురక్ష కార్యక్రమం పూర్తయ్యేసరికి నియోజకవర్గంలో లబ్ధిదారులకు ఎలాంటి సమస్యలు ఉండకూడదని అధికారులకు సూచించారు. ఈసందర్భంగా కుల ధ్రువీకరణ పత్రాలు 54, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు 56, వివా రిజిస్ట్రేషన్ 2, ఫ్యామిలీ మెంబర్ 4, కౌలు రైతుగుర్తింపు కార్డులు 40, ఆధార్ కార్డులు 35, రేషన్‌కార్డులు మార్పులు 14 నరుకుళ్లపాడులో మొత్తం 204 సమస్యలను గుర్తించారు. కార్యక్రమంలో డీసీసీ బ్యాంకు డైరెక్టర్ కోట హరిబాబు, ఎంపీపీ మేకల హనుమంతరావు, జెడ్పీటీసీ సభ్యులు కరుణకుమారి, వైఎస్సార్ సీపీ జేసీఎస్ కన్వీనర్ నాయుడు రాంబాబు, గ్రామ ఉప సర్పంచి నల్లిబోయిన శ్రీనివాసరావు, నాయకులు భవిరిశెట్టి హనుమంతరావు, ఆళ్ళ శ్రీనివాసరెడ్డి, చిలకా సాంబయ్య, అమృతవేణ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష

నకరికల్లు: ప్రజాసమస్యలు సత్వరమే పరిష్కరించేందుకు జగనన్న సురక్ష దోహదపడుతుందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి అన్నారు. మండలంలోని చీమలమర్రి గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం సోమవారం నిర్వహించారు. పలురకాల సమస్యలపై మొత్తం 73 అర్జీలు వచ్చినట్లు ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మేడం ప్రవీణ్‌కుమార్ రెడ్డి, సర్పంచి బత్తుల ఉపేంద్ర, ఎంపీటీసీ సభ్యుడు తిరుమలశెట్టి సాంబయ్య, ఈఓపీఆర్డీ గిరిధర్, గ్రామ కార్యదర్శి శైలేంద్రకుమార్, వీఆర్వో కె.రమణారెడ్డి పాల్గొన్నారు.

నేడు నందిగామలో జగనన్న సురక్ష

సత్తెనపల్లి: జగనన్న సురక్ష కార్యక్రమం సత్తెనపల్లి మండలం నందిగామలోని రెండు సచివాలయాల్లో మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జీవీ సత్యనారాయణ సోమవారం తెలిపారు. ప్రతి ఒక్కరూ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు. అలాగే పట్టణంలోని అచ్చంపేట రోడ్ లోని సచివాలయంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి తెలిపారు.

ముప్పాళ్ల మండలంలో...

ముప్పాళ్ల: మండలంలోని నార్నెపాడు, పలుదేవర్లపాడు గ్రామాల్లో మంగళవారం జగనన్న సురక్ష గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఎం.భవానీశంకర్ సోమవారం తెలిపారు. అధికారులు హాజరు కావాలని కోరారు.

రాజుపాలెం మండలంలో..

రాజుపాలెం: మండలంలో రెడ్డిగూడెం, అనుపాలెం గ్రామాలలో జగనన్న సురక్ష కార్యక్రమాలు మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ టి.శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. కార్యక్రమాలలో మండలస్థాయి అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు పాల్గొనాలని ఎంపీడీవో సూచించారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలని వినతి



తహసీల్దార్‌కు అర్జీ ఇస్తున్న అనంతవరం రైతులు

క్రోసూరు: మండలంలోని అనంతవరంలో హెచ్‌పీసీఎల్ కంపెనీ తమ పొలాల్లో గ్యాస్ పైప్‌లైన్లు వేయటం వలన రాళ్లతో గుట్టగుట్టలు ఉండిపోయి నాలుగేళ్లుగా పైర్లు వేయక నష్టపోయామని, తమకు సదరు హెచ్‌పీసీఎల్ నుంచి నష్టపరిహారం ఇప్పించాలని తహసీల్దార్ ఎం.జియావుల్‌హక్‌కు సోమవారం అర్జీ అందజేశారు. కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి టి.హనుమంతరావు మాట్లాడుతూ 2018–19లో అనంతవరం రైతుల పొలాల నుంచి హెచ్‌పీసీఎల్ కంపెనీ గ్యాస్ పైప్ లైన్లు వేయటం జరిగిందన్నారు. ఇప్పటికైనా సమస్యను పరిశీలించి రైతులకు తగిన నష్టపరిహారం చెల్లించి, పంటలు వేసుకునేందుకు నేల చదును చేయించేందుకు చర్యలు తీసుకోవాలని అర్జీ అందజేసినట్లు తెలిపారు. అర్జీ అందచేసిన వారిలో రైతులు నక్కా వెంకట్రావు, తాడిబోయిన ఏడుకొండలు, నక్కా శ్రీనివాసరావు, ఎస్.రమేష్, కోటేశ్వరరావు, కె.లక్ష్మణరావు పాల్గొన్నారు.

ములాయంసింగ్ విగ్రహావిష్కరణ వాల్‌పోస్టర్లు ఆవిష్కరణ

సత్తెనపల్లి: గుంటూరు జిల్లా మంగళగిరి నాగార్జున యూనివర్సిటీ దగ్గర ఈ నెల 9న ములాయం సింగ్ యాదవ్ విగ్రహావిష్కరణ వాల్‌పోస్టర్లను బీసీ సంఘాల నాయకులు ఆవిష్కరించారు. పట్టణంలోని యాదవ హాస్టల్ వద్ద పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్ హాజరవుతారని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ, జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, టీడీపీ రాష్ట్ర నాయకులు తాళ్ల వెంకటేష్ యాదవ్, రాష్ట్ర యాదవ సంఘం నాయకులు ఉప్పుటూరి పేరయ్య యాదవ్, యాపా ఫౌండర్ ప్రెసిడెంట్ దాసరి శివకుమార్, తుపాకుల మోహన్ రావు, జ్ఞానేశ్వర్, ఉమాభానుయాదవ్, యాదవ సంఘ నాయకులు సుబ్బయ్య, గంటా ఏసుబాబు, లోకా మాధవ, నారాయణ, గడ్డం వెంకటేశ్వర్లు(బుల్లోడు), తోక మధన్మోహన్,లాకు పిచ్చయ్య, యామర్తి శ్రీను, దుడ్డు అప్పారావు, ప్రకాష్, జక్కుల వాసు, గంట శివ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

శాకంబరీదేవిగా బాలచాముండేశ్వరీ దేవి



అమరావతి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతి బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం బాలచాముండేశ్వరీదేవి శాకంబరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని అమ్మవారికి అన్ని రకాల కూరగాయలతో ఎంతో ఆకర్షణీయంగా అలంకరించారు. లోక కల్యాణార్థం పాడిపంటలతో రైతులంతా సుఖసంతోషాలతో జీవించాలని అమ్మవారిని ప్రకృతిలో దొరికె అన్నిరకాల కూరగాయలతో అలంకరించటం జరిగిందని ఈఓ వేమూరి గోపి తెలిపారు. అమ్మవారిని పెద్ద సంఖ్యలో దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దేశమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



పెదకూరపాడు మండలంలోని 75 త్యాళ్లూరులోని దేశమ్మతల్లికి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. దేశమ్మ తల్లికి గ్రామ ఉమ్మడి పొంగళి చేసి సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం నుండి మహిళ భక్తులు ప్రభల ఊరేగింపుతో కలిసొచ్చి మొక్కులు చెల్లించారు. సహపంక్తి భోజనాలు చేసి ఉత్సవాలు ముగించారు.

రైలు ఢీకొని యువకుడి మృతి

నరసరావుపేట టౌన్: గూడ్స్ రైలు ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన సోమవారం నరసరావుపేట రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని నకరికల్లు శివారు చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నకరికల్లు సమీపంలో రైలు పట్టాలపై గుర్తు తెలియని మృతదేహం పడిఉందన్న సమాచారం శావల్యాపురం స్టేషన్ మాస్టర్ అందించారు. దీంతో సీఐ టి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు నకరికల్లుకు చెందిన యర్రంశెట్టి మల్లికార్జున(29)గా గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమతులు లేని ట్రాక్టర్ సీజ్

నరసరావుపేట టౌన్: ప్రజలకు అసౌకర్యాన్ని గురిచేస్తూ పట్టణంలో సంచరిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు టూటౌన్ సీఐ వీరేంద్రబాబు సోమవారం తెలిపారు. గత కొన్ని రోజులుగా ఓ రాజకీయ పార్టీకి సంబంధించి ప్రచారం నిర్వహిస్తూ, లౌడ్ స్పీకర్లతో ట్రాక్టర్ సంచరిస్తోంది. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాల్లో మైకు ఎక్కువగా సౌండ్ పెడుతుండటంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు.

చుక్కల భూములకు శాశ్వత పరిష్కారం

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అచ్చంపేట: ఎన్నో సంవత్సరాలుగా చుక్కల భూములను సేద్యం చేసుకుంటున్నా, ఆ భూములపై హక్కులు లేక ఇబ్బందులు పడుతున్న రైతులకు శాశ్వత హక్కులు కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. స్థానిక డంపింగ్ యార్డు వద్ద సుమారు 30 సంవత్సరాలుగా చుక్కల భూములను సాగుచేసుకుంటున్న తొమ్మిదిమంది రైతులకు హక్కులు కల్పిస్తూ సోమవారం పట్టాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ చుక్కల భూసమస్యలను గత ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారని చెప్పారు. సాగుచేసుకుంటున్న రైతులకు ఆ భూములపై సర్వహక్కులు కల్పించడం ప్రభుత్వ బాధ్యతగా సీఎం జగన్ భావించారన్నారు. రెవెన్యూ కార్యాలయాలు, కోర్టులు చుట్టూ తిరిగే పనిలేకుండా ఒక్క రూపాయలు ఎవరి ఇచ్చే అవసరం లేకుండా దశాబ్దాలుగా నెలకొన్న భూసమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించారని పేర్కొన్నారు. మండలంలో ప్రతి గ్రామంలో చుక్కల భూములకు మోక్షం కలిగించనున్నట్లు తెలిపారు. పెదకూరపాడు నియోజకవర్గం నుంచి తనను తిరిగి ఎమ్మెల్యేగా గెలిపించి, నియోజకవర్గంలో మరింత అభివృద్ధి చేసేందుకు అవకాశం కల్పించాలని కోరారు. ఎమ్మెల్యేను లబ్ధిదారులు సత్కరించారు. తొలుత మండల పరిషత్ కార్యాలయం వెనుక భాగాన గౌడకుల ఆరాధ్యదేవత రేణుగా యల్లమ్మతల్లి దేవాలయ నిర్మాణానికి ఎమ్మెల్యే శంకరరావు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో తహసీల్దారు సీహెచ్ పద్మాదేవి, ఎంపీడీఓ పి.శివసుబ్రహ్మణ్యం, పార్టీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య, తాళ్లచెరువు సర్పంచి కిక్కురు అల్లారెడ్డి, మాజీ సర్పంచులు తుమ్మా చిన్నపరెడ్డి, వాశిరెడ్డి వెంకటేశ్వరరావు, సుంకర శ్రీనివాసరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు రామిశెట్టి రంగయ్య, మాజీ అధ్యక్షులు రామిశెట్టి చిన్న యల్లమందయ్య, జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు సాతర్ల శ్రీనివాసరావు, మార్కెట్‌యార్డు డైరెక్టర్ ఆకుల కోటేశ్వరరావు, ఉప సర్పంచి జానీ పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాల లబ్ధి

● ఎమ్మెల్యే నంబూరు శంకరరావు
● వెంకటాయపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం



ప్రభుత్వం ద్వారా చేకూరిన లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

బెల్లంకొండ: అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా చేసుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని, జగనన్న పాలనలో అంతా సంక్షేమమేనని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు తెలిపారు. మండలంలోని వెంకటాయపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం సోమవారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించారు. నాలుగేళ్ల కాలంలో ఇంటికి చేకూరిన లబ్ధిని వివరించారు. ప్రభుత్వ పథకాలు అందకపోయినా, సమస్యలు ఏమైనా ఉన్నా నాకు ఫోన్ చేయండి... వెంటనే పరిష్కారం అయ్యేలా చూస్తాను అంటూ ఎమ్మెల్యే ఇంటింటికీ వెళుతూ కార్యక్రమాన్ని కొనసాగించారు. కార్యక్రమంలో ఎంపీపీ చెన్నుపురెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ బూదాటి మరియదాసు, సొసైటీ అధ్యక్షుడు భద్రయ్య, సర్పంచి దేసు బ్రహ్మం, ఎంపీటీసీ సభ్యురాలు చిట్టెంశెట్టి శివనాగమణి, నాయకులు భుక్యా రామకోటినాయక్, చినతిరుపతయ్య, మేళం భాస్కరరావు, బోజ్యానాయక్, చేవూరి లక్ష్మయ్య, ఎంపీడీఓ వెంకటరెడ్డి, తహసీల్దార్ దుర్గేష్ పాల్గొన్నారు.

నేడు ఎన్జీ రంగా కాంస్య విగ్రహావిష్కరణ



నందిగామలో రంగా కాంస్య విగ్రహావిష్కరణ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న పెండెం బాబూరావు

సత్తెనపల్లి: పట్టణంలోని లక్కరాజుగార్లపాడు బస్టాప్ సెంటర్‌లో మంగళవారం వంగవీటి మోహన రంగా కాంస్య ఆవిష్కరణ నిర్వహించనున్నట్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబూరావు తెలిపారు. సత్తెనపల్లి మండలం నందిగామ, గుడిపూడి, పెద్దమక్కెన, గర్నెపూడి గ్రామాలల్లో ఆయన పర్యటించిన రంగా కాంస్య విగ్రహావిష్కరణకు సంబంధించిన కరపత్రాలను సోమవారం ఆవిష్కరించారు. బాబూరావు మాట్లాడుతూ వంగవీటి మోహన్‌రంగా అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేశాడని కొనియాడారు. విగ్రహా ఆవిష్కరణ సత్తెనపల్లిలో చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారన్నారు. విగ్రహావిష్కరణ ముఖ్యఅతిథులుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ హాజరు కానున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు రెంటపాళ్ల ప్రియదర్శిని, వైఎస్సార్ సీపీ నాయకులు అక్కేశ్వరరావు, జంగాల సంపత్‌కుమార్, మద్దు వినోద్, మోషా, నవరత్నకుమార్, ఫిలిప్, జడా ప్రసాద్ పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలకు ఫ్యామిలీ డాక్టర్



ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ రాజకుమారి

పెదకూరపాడు: గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకే ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామ్ నిర్వహిస్తోందని సత్తెనపల్లి ఆర్డీఓ రాజకుమారి అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆదేశాల మేరకు లగడపాడు గ్రామంలో రెడ్డిగారి సత్రం వద్ద నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఆరోగ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్య అధికారి డాక్టర్ వెలిగొండారెడ్డి, తహసీల్దారు క్షమారాణి, ఎంపీడీఓ నరసింహారావు పాల్గొన్నారు. అనంతరం తహసీల్దారు కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో జగనన్న రీసర్వేపై సమావేశం నిర్వహించారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి



పునీత్ సాగర్ ర్యాలీలో పాల్గొన్న ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లయ్య, మేజర్ రాజు తదితరులు

నరసరావుపేట ఈస్ట్: పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవుతూ, నీటి సంరక్షణపై బాధ్యతతో వ్యవహరించాలని శ్రీ సుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సోము మల్లయ్య తెలిపారు. కళాశాల ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో సోమవారం ఏక్ భారత్–శ్రేష్ట భారత్‌లో భాగంగా నిర్వహించిన పునీత్ సాగర్ అభయాన్ ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సముద్రాలు, నదులు, సరస్సులు, మంచినీటి గుంతలను శుద్ధి పరిచేందుకు చేపట్టిన పునీత్‌సాగర్ అభయాన్‌లో ప్రతి ఒక్కరూ భాగస్వాములై స్వచ్ఛమైన నీటిని భావితరాలకు అందించాలని తెలిపారు. ఎన్‌సీసీ ఆఫీసర్ మేజర్ బి.ఎస్.ఆర్.కె. రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఇంటర్మీడియేట్ ఇన్‌చార్జి డాక్టర్ ఎం.ఎస్.సుధీర్, అధ్యాపకులు, ఎన్‌సీసీ క్యాడెట్స్ పాల్గొన్నారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించి ప్లాస్టిక్ వ్యతిరేక నినాదాలు చేశారు. నీటి వనరుల్ని కాపాడుకుంటామని ప్రతిజ్ఞ చేశారు.

బాలిక అదృశ్యం

నరసరావుపేట టౌన్: బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ అశోక్ కుమార్ సోమవారం తెలిపారు. ఇరుకుపాలెం గ్రామానికి చెందిన 16 ఏళ్ల బాలిక పట్టణంలోని ప్రభుత్వ హాస్టల్‌లో ఉంటూ విద్యను అభ్యసిస్తోంది. ఆదివారం హాస్టల్ నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆమె కోసం గాలించినా ఆచూకీ తెలియలేదు. దీంతో బాలిక తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.